# యేసు ప్రేమించుచున్నాడు

జనవరి 2012 మాసపత్రిక




ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి.
నేను మీకు విశ్రాంతి కలుగజేతును -మత్తయి 11:28

# యేసు ప్రేమించుచున్నాడు

## మాసపత్రిక


సంపుటి -1 జనవరి 2012 సంచిక-2012



చీఫ్ ఎడిటర్

**రెవ. డా॥ యస్. పాల్సన్ రాజ్**

ఎడిటర్

**రెవ. డా॥ జయప్రకాశ్ గోపు**

M.Pharm, Ph.D., M.A., (M.Phil.)
Professor in Pharmacology.

సర్క్యులేషన్

**రెవ. సి.హెచ్. డేవిడ్**

**బ్రదర్. రవిపాల్ .ఆర్**


**మాస పత్రిక వార్షిక చందా**
**రూ॥ 300/-**


## గెత్సేమనే ప్రేయర్ టవర్

యేసు నిలయం, కరుణాపురము,
పెద్దపెండ్యాల, వరంగల్-506 151.
ఆంధ్రప్రదేశ్ (ఇండియా)

ఫోన్:08711-223115, 08711-200268,
9247009336, 9396856321

E-mail : paulsonraj@yahoo.co.in
jprakash9000@yahoo.co.in
www.christhujyothi.org.


## విషయ సూచిక


1. ఈ సంవత్సరము నూరంతల ఫలము 1
2. IMMANUEL IS BORN 3
3. వేద పఠనము 5
4. ప్రిస్కిల్ల 7
5. సాక్ష్యములు 9
6. ప్రార్థన




## కరుణాపురము యొక్క ప్రార్థన సమయాలు



1. **ఉపవాస ప్రార్థనలు**
   ప్రతి శనివారము 7, 14, 21, 28
   ఉ॥ 9 గం॥ల నుండి సా॥ 5 గం॥ల వరకు
2. **ఆల్‌నైట్ ప్రార్థన 10**
   ప్రతినెల 2వ మంగళవారము
   సా॥ 7 గం॥ల నుండి ఉ॥ 5 గం॥ల వరకు
3. **యౌవ్వనస్థుల ప్రార్థన**
   ప్రతినెల 4వ ఆదివారము 22
   ఉ॥ 9 గం॥ల నుండి సా॥ 4 గం॥ల వరకు



- రెవ॥ డా॥ పాల్‌సన్‌రాజ్

# ఈ సంవత్సరము నూరంతల ఫలము



క్రీస్తునందు ప్రియ పాఠకులారా, ప్రభువులకు ప్రభువైన యేసుక్రీస్తు పరిశుద్ధ నామములో మీ అందరికి శుభములు తెలియజేయుచున్నాను. అంతేగాక, క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరము తరపున **"నూతన సంవత్సర శుభాకాంక్షలు"** మీ అందరికి తెలియజేయుచున్నాము.

మనిషి జీవితములో ఎన్నో సంవత్సరములు గతించి పోయాయి క్రొత్త సంవత్సరములు వస్తూనే ఉన్నాయి, కాని దేవుని ఆశీర్వాదములు సంపూర్ణముగా పొందలేకపోవుచున్నాడు. దేవుని వాగ్ధానములు తన జీవితములో నెరవేర్చబడాలని ఎంతో ఆశపడి ఎదురుచూచుచున్నాడు, గాని ఆశ నిరాశగానే మిగిలిపోవుచున్నది. దేవుడు మనుష్యుని సంపూర్ణముగా ఆశీర్వదించాడు.

**"దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమి మీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను".** ఆ.కా. 1:28.

ఈ ఆశీర్వాద వచనములను గమనించిన యెడల దేవుడు మనము ఫలించాలని, అభివృద్ధి చెందాలని, మరియు విస్తరించబడాలని కోరుకొనుచున్నాడు. సృష్టిలో మనము గమనించిన యెడల జంతువులు, ఆకాశపక్షులు, ప్రాకెడి పురుగులు, జలరాశులు మరియు చెట్లు, వృక్షములు అన్ని కూడా ఫలిస్తూ, అభివృద్ధి చెందుతూ, విస్తరిస్తూ ఉన్నాయి. మరి తన పోలికతో నిర్మించుకున్నటువంటి మానవుడు వీటన్నిటి కంటే కూడా ఆశీర్వదించబడాలని దేవుడు ఆశీర్వదించాడు. వాస్తవానికి మానవుడు దేవుని ఫలములను మరియు ఆశీర్వాదములను పొందలేకపోవుచున్నాడు. ఇన్ని సంవత్సరములు దేవుని ఆశీర్వాదములను పరిపూర్ణముగా పొందకుండానే నీ జీవితము గడిచిపోవుచున్నాదా, ఎప్పుడయినా నిన్ను నీవు పరీక్షించుకున్నావా మన దేవుడు ఆశీర్వాదమునకు కర్తయైన దేవుడు కాడా.

**"యెహోవా, నీతిమంతులను ఆశీర్వదించువాడవు నీవే".** కీర్తన 5:12. తన యొద్దకు వచ్చు వారిని ఎవరిని త్రోసివేయక వారిని దీవించు దేవుడైయున్నాడు. ఈ సంవత్సరము నీవు నూరంతల ఫలము పొందాలని మా ప్రార్థన మరియు దేవుడు కోరుకొనుచున్నాడు. ఇటువంటి ఆశ నువ్వు కలిగియు న్నావా? ఏ విధముగా మనము ఈ నూరంతల ఆశీర్వాదము పొందగలము. దేవుని వాగ్ధానములను మాత్రమే మనము కలిగియుంటే సరిపోదు. దేవుడు మనతో చెప్పిన మాట ప్రకార ముగా మనము జీవించవలసియున్నది. చాలా మందినాకు దేవుని వాగ్ధానమున్నది అని తలంచుచూ తమ ఇష్టానుసారము గా జీవిస్తూ ఉంటారు. దేవుని వాగ్ధానము మనయందు నెరవేర్చబడాలి అంటే, మన ఇష్టానుసారముగా కాక, దేవుని వాక్యానుసారముగా మనము జీవించాలి. అప్పుడే దేవుడు ఇచ్చిన తన వాగ్ధానాన్ని మన యందు నెరవేర్చును.

**"దేవుని వాగ్ధానములు ఎన్నియైనను అన్నియు క్రీస్తునందు అవునన్నట్టు గానే యున్నవి గనుక మన ద్వారా దేవునికి మహిమ కలుగుటకై అవి ఆయన వలన నిశ్చయములైయున్నవి".** II కొరింథీ 1:20.

పైన చెప్పబడిన వాక్యము ఆధారముగా దేవుడు ఒక వాగ్ధానమునే కాదు క్రీస్తు ద్వారా ఎన్ని వాగ్ధానములు ఉన్నవో అవన్ని ఆమేన్ అని అనుచున్నాడు, ఈ వాగ్ధానములన్ని నీ జీవితములో నెరవేర్చబడాలని ఎదురుచూచుచున్నాడు. దేవుని దీవెనలు మానవునికి తప్పకుండా అవసరమైయున్నవి, ఈ లోకములో ఎన్ని ఉన్నా, ఆ దేవాది దేవుని దీవెన లేనియెడల అన్నియు వ్యర్థమే. ఇస్సాకు కుమారుడైన యాకోబు ఈ లోక సంపద ఎంతో కలిగియున్నాడు కాని, నీవు నన్ను దీవించు వరకు నేను నిన్ను విడువను అని తనతో పోరాడుచున్న నరునితో చెప్పియున్నాడు. దేవుని ఆశీర్వాదం వల్లనే మనము సంతోష సమాధానములతో జీవిస్తూ మనము చేయు ప్రయత్నములలో మరియు పనులలో ఫలించుదుము.

అబ్రాహాము కుమారుడైన ఇస్సాకు అబ్రాహాము యొద్ద నుండి దేవుని యెడల భయభక్తులను కలిగియుండుట నేర్చుకొనెను. దేవుని మాట వినుట ఎంత శ్రేష్టమో, దాని వలన కలుగు దేవుని ఆశీర్వాదము ఎంత గొప్పదో అతడు గ్రహించెను గనుక సర్వోన్నతుడైన దేవునికి భయపడుచు, తన తండ్రి అయిన అబ్రాహాము అడుగుజాడలలో నడిచాడు, అందు నిమిత్తమే ఇస్సాకు భయపడిన దేవుడు అని దేవునికి నామము కలిగెను.

**"నా తండ్రి దేవుడు అబ్రాహాము దేవుడు, ఇస్సాకు భయపడిన దేవుడు".** ఆ.కా. 31:42.

ఇస్సాకు దేవుని యెడల ఎంతో భయమును కలిగి జీవించేవాడు, దేవునిని ధ్యానించుటకు అతడు తన తండ్రి నుండి కూడా వేరై బెయేర్ లహాయిరోయి అను ప్రాంతములో కాపురముండుచుండెను. దేవునితో అనుదినము సహవాసము కలిగియుండి, విశ్వాసమందు బలపడుచూ, దేవుని మీద

"మంచి ఫలము ఫలింపని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడును". - మత్తయి 3:10.

ఆధారపడి జీవించుచుండెను.

**"ఇస్సాకు బేయేర్ లహాయిరోయి మార్గమున వచ్చి దక్షిణ దేశమునందు కాపురముండెను. సాయంకాలమున ఇస్సాకు పొలములో ధ్యానింపబయలువెళ్ళి".** ఆ.కా. 24:62,63.

ఇస్సాకు అబ్రాహామునకు వాగ్ధాన పుత్రుడు. భూమి యొక్క సమస్త వంశావళులు ఆశీర్వదించబడునని అబ్రాహామునకు వాగ్దానము కలదు. ఆ వాగ్దానములు అబ్రాహాము తర్వాత ఇస్సాకు ద్వారా నెరవేర్చబడవలసియున్నది. ఇస్సాకు నాకు దేవుని యొద్ద నుండి వాగ్దానములు ఉన్నవి అని తన ఇష్టానుసారమైన జీవితమును గడుపలేదు కాని, అతడు దేవునిలో క్రమానుసారమైన జీవితమును జీవించాడు. ఇలాంటి జీవితము జీవించుచున్న ఇస్సాకుకు దేవుడు ఒక చక్కని కన్యకయైన రిబ్కాను భార్యగా ఇచ్చాడు. ఇస్సాకు సంతానము లేకుండా ఉన్నప్పుడు ఆమె విషయమై దేవునికి ప్రార్థన చేసెను. దేవుడు ఇస్సాకు ప్రార్థన విని రిబ్కా గర్భము తెరిచెను.

**"ఇస్సాకు భార్య గొడ్రాలు గనుక అతడు ఆమె విషయమై యెహోవాను వేడుకొనెను. యెహోవా అతని ప్రార్థన వినెను గనుక అతని భార్యయైన రిబ్కా గర్భవతి ఆయెను".** ఆ.కా. 25:21.

ఇస్సాకు యొక్క పరిశుద్ధ, భయభక్తులు కలిగిన జీవితమును బట్టి దేవుడు అతని ప్రార్థనలను వినుచుండెను. నీవును వాగ్దానములు కలిగిన దేవుని కుమారుడవు కుమార్తెవు, గనుక దేవుని యందు భయభక్తులు కలిగి చెడుతనమును విసర్జించి, అనుదినము వాక్యము ధ్యానిస్తూ, ప్రతి దినము పరిశుద్ధాత్మలో ప్రార్థన చేసిన యెడల, దేవుడు నీ ప్రార్థనను ఆలకించి నీకు కలిగిన వాగ్దానములన్నింటిని నెరవేర్చును. వాగ్దానము మన జీవితములో నెరవేర్చబడుటకు దేవుని మాట వినుట ఎంతో ముఖ్యమైనది. అదే విధముగా దేవుని ఆశీర్వాదములు పొందుటకు కూడా ఆయన మాట చొప్పున మనము నడుచుకొనవలెను. ఇస్సాకు ఫిలిష్తీయుల దేశములో నివసించుచుండగా, ఆ ప్రాంతములో కరువు వచ్చెను. కరువు సమయములో చాలా మంది ఐగుప్తునకు వెళ్లెదరు. తన తండ్రియైన అబ్రాహాము తన జీవితకాలములో కరువు కలిగినప్పుడు ఐగుప్తునకు వెళ్లినట్లుగా దేవుని వాక్యము సెలవిచ్చుచున్నది. ఇస్సాకు ఎచ్చటికి వెళ్లాలి? ఐగుప్తునకు వెళ్లవలెనా, అని దేవునికి ప్రార్థన చేయుచున్న సమయములో దేవుడు అతనికి ప్రత్యక్షమై ఇచ్చిన సమాధానమేమనగా **"అక్కడ యెహోవా అతనికి ప్రత్యక్షమై నీవు ఐగుప్తులోనికి వెళ్లక నేను నీతో చెప్పుదేశమందు నివసించుము. ఈ దేశమందు పరవాసివైయుండుము నేను నీకు తోడైయుండి నిన్ను ఆశీర్వదించెదను";** ఆ.కా. 26:2,3

ఆ ప్రాంతములో ఇస్సాకుకు కరువు కనపడుచున్నది; దేవుడేమో ఈ దేశమందే నివసించుము నేను నిన్ను ఆశీర్వదించెదను అని చెప్పుచున్నాడు. ఈ పరిస్థితులలో ఉన్న చాలా మంది కరువును చూసి భయపడి వెళ్ళిపోవుదురు, దేవుని మాటను పాటించకపోవుదురు కాని, ఇస్సాకు వాస్తవ పరిస్థితి, ప్రతికూలముగా ఉన్నప్పటికీ దేవుని మాటయందు విశ్వాసముంచి ఆ దేశమందున్నవాడై పంటను వేసెను. అతడు పొందిన ఆశీర్వాదములు క్రింది వచనములో చూడవచ్చును.

**"ఇస్సాకు ఆ దేశమందున్నవాడై విత్తనము వేసి ఆ సంవత్సరము నూరంతలు ఫలము పొందెను. యెహోవా అతనిని ఆశీర్వదించెను గనుక ఆ మనుష్యుడు గొప్పవాడాయెను. అతడు మిక్కిలి గొప్పవాడగువరకు క్రమ క్రమముగా అభివృద్ధి పొందుచు వచ్చెను. అతనికి గొఱ్ఱెల ఆస్తియు, గొడ్ల ఆస్తియు దాసులు గొప్ప సమూహమును కలిగినందున ఫిలిష్తీయులు అతని యందు అసూయపడిరి".** ఆ.కా. 26: 12,13,14.

వ్యవసాయము పంటకు అన్ని సమకూడినప్పటికి నూరంతల ఫలం పొందుట ఎంతో కష్టము, కాని ఇస్సాకుకు నూరంతల పంట అన్ని మంచి వాతావరణంలో కలిగినవి కాదు కాని ప్రతికూల వాతావరణంలో వచ్చినవి, ఎందుకనగా అతడు దేవుని మాటకు లోబడి ఆదేశములో కరువు ఉన్నప్పటికినీ, ఆదేశములోనే ఉండెను.

క్రీస్తునందు ప్రియ పాఠకులారా, నీ జీవితములో అనుకూలమైన పరిస్థితులను వెదకక, దేవుని మాట ప్రకారముగా జీవించు. నీ చుట్టు ఉన్న పరిస్థితులు నీకనుకూలముగా లేకపోవచ్చును అవి నీకెంతో వేదన మరియు బాధ కలిగించవచ్చును. ఇక ఏ మాత్రము లాభము లేదు అనే స్థితికి నీవు వచ్చియున్నావేమో. ధైర్యము తెచ్చుకొనుము, దేవుని మాట యందు విశ్వాసముంచుము. కరువులో జీవించడమంటే సాధారణమైన విషయం కాదు వారి ప్రాణమునే పణముగా పెట్టుచున్నారు. జీవం గల దేవుడు జీవింపచేస్తాడు అని ఆ దేశములో ఉండి నూరంతల ఫలం పొందుచూ, అతడు ఆశీర్వదించబడి చాలా గొప్పవాడాయెను. ఈ సంవత్సరం నీవును దేవుని మాటకు విధేయుడవై నీ చుట్టు పరిస్థితులను చూడక దేవుని మాటను నమ్మకొని ఆశీర్వదింపబడుము. దేవుడు మీకు పంటలోను, పాడిలోను, వ్యాపారములోను, ఉద్యోగములోను, మీ కుటుంబములోను నూరంతల ఫల ఆశీర్వాదములను దయచేయును గాక, మీ గర్భఫలము దేవుడు దీవించును గాక. మీరు చేయు ప్రతి ప్రయత్నములో యేసు నూరంతల ఫలము కలుగునట్లు ఆజ్ఞాపించి, మీకు కలిగిన సమస్తమును నూరంతలుగా దీవించును గాక. ఆమేన్.

# "I AM STRONG"



Peace and grace to all of you in the name of Jesus Christ who is Prince of Peace. The LORD our God refreshes and revives our hearts and leads us into everlasting life. Our Prayers are Continually Poured before the throne of Jesus Christ for your sake we rejoice in the Lord for all of you, because of your faith in trails & temptations. Hope you are well in all things, may the LORD provide all your deficiencies.

God gives wonderful life to man and also showers his abundant blessings. God's own hands created man and gave a strong Physical structure to man

**"There were giants on the earth in those days"** (Genesis 6:4)

Israelites were very strong people; they worked with very hard labor.

**"Look the people of the children of Israel are more and mightier than us"** (Exodus 1:9)

**"So the Egyptians made the children of Israel serve with vigor"** (Exodus 1:13)

These words were spoken by Pharaoh of Egypt about the children of Israel. They were abiding to all kinds of hard work. They built the great cities for Pharaoh. These cities are Pithom and Raamases. God never desired for man to be strong only physically but should be strong in the spirit of God. Man's strength dwindles when old age draws, but if man is strong in the spirit even though old age draws he is strong, because our God is strong and never faints.

**"Have you not known? Have you not heard? The everlasting God, the LORD. The creator of the ends of the earth neither faints nor is weary. His understanding is unsearchable"** (Isaiah 40:28)

In the heart of man sin makes man weak and unstable spiritual life. Man should have regular spiritual exercise which makes him strong spiritually. Even physical strong people lost the battle and were killed.

**"Saul and Jonathan were beloved and Pleasant in their lives and in their death they were not divided. They were swifter than eagles. They were stronger than lions"** (II Samuel 1:23)

Saul and Jonathan were stronger than lions in their strength but they were killed by the philistines in the battle. When Saul was anointed as king over philistines, the spirit of God came upon him and he could overcome the philistines but when he sinned against God, the spirit of God left him and he could not win the battle. Though he is strong physically, unless and until the spirit of God supports our physical strength we can so nothing. Young people are considered to be strong but if God doesn't give strength to them they cannot be strong.

**"Even the youth shall faint and be weary. And the young men shall utterly fall"** (Isaiah 40:30)

Prophet Isaiah is Prophesying about young men, that they will faint. Man's full strength is exhibited in his youth days. They can work hard and even they can do hard physical activity. Samson a strong youngman who killed 1000 philistines with Jaw bone of donkey. No enemy could face

him because of his strength which was given by God. But when he sinned he was bound by the philistines, his eyes were removed and he became blind. In his earlier days he was strong but due to sin he became weak and fainted. Young people are unable to overcome the devil and temptations of the devil, because of weak spiritual strength. If we are in sin strength of the spirit will not be manifested through us but if we wait upon the Lord the Power of God is manifested through us. The Power of God makes the weak strong and they will easily overcome the temptations of the devil and also the power of the devil. Prophet Daniel was waiting upon the Lord in His presence and God showed him many visions and Daniel became speechless and no strength remained in him.

**"My Lord because of the vision my sorrows have overwhelmed me, and I have retained no strength"** (Daniel 10:16)

We may be surprised because Daniel who was seeing the vision of God, had lost strength. He has to gain strength but the word of God says no strength remains in him. God was showing His visions to Daniel and as he was completely immersed in the presence of spirit of God. Daniel's physical strength was slowly burning out and finally when the vision came to end his face was to the ground and he was unable to stand and became breathless. Angel of God touched Daniel's lips he started speaking and again when the angel touched Daniel gained strength.

**"Then again the one having the likeness of a man touched me and strengthened me."**(Dan 10:18)

When the angel of God touched Daniel, immediately he was strengthened, Daniel was strengthened by God and he lived for God and saw many visions and he heard voice of God.

Dear reader when you loose strength just the touch of God is sufficient for you to be strengthened. King Saul lost his strength and could not regain because of disobedience towards God, but Daniel because of his spiritual holy life and obedience to God in all things though his strength was lost, the touch of God gave him full strength. You should pray constantly in order to receive strength from God. God wants man to be strong to fight with the devil. God did not simply prepare everything for the people of Israel to inherit the land of canaan. God said to them to fight with the people of canaan. God manifests His strength through us to give us the victory and His honor to us and to glorify us. When the spirit of God falls on us the full power of God is revived in us.

God through the Prophet Joel speaks like this:- **"Let the weak say 'I am strong' "** (Joel 3:1)

God knows you are weak but He is giving His spirit to strengthen us so you become strong. All of you should say 'I am strong'. This year you should be strong and overcome each and every temptation of the devil and destroy the power of the Satan. For you to be strong what you should do,

"But those who wait upon the LORD shall renew their strength, they shall mount up with wings like eagles, they shall run and not be weary they shall walk and not faint." (Isaiah 40:31)

Redeem the time carefully and wait upon the LORD and you shall renew strength this year and you shall be strong.Wish you all a happy new year.

**GOD BLESS YOU.**



"సాత్వికులు ధన్యులు వారు భూలోకమును స్వతంత్రించుకొందురు". - మత్తయి 5:5.

- రెవ. కె. సమూయేలు

# వేద పఠణము

| | | |
|---|---|---|
| గ్రంథము | : | రూతు గ్రంథము |
| గ్రంథకర్త | : | సమూయేలు (యూదుల ఇతిహాసము) |
| గ్రంథము వ్రాయబడిన కాలము | : | 1010 సుమారు |
| గ్రంథము వ్రాయబడిన స్థలము | : | కనాను |

(గత సంచిక తరువాయి)

**(ఈ గ్రంథం వరకు గల అధ్యాయముల మొత్తము 236 వచనాల మొత్తము 7211)**

క్రీస్తు నందు ప్రియులారా, మనం గత సంవత్సరం (2011) డిసెంబర్ మాసంలో రూతు గ్రంథంలో నుంచి 3వ అధ్యాయంను అధ్యయనం చేయగల్గితిమి. అందులో రూతు "తనను విడిపింపగలవాని సహాయంను వేడుకొనుట"ను గూర్చి మనము ధ్యానించితిమి.

అందులో ముఖ్యముగా రూతుకు బోయజు కంటె కూడ సమీపమైన బంధువుడు మరొకరు కలరని అతని విషయం పూర్తిగా తెల్సుకొనిన తర్వాతనే తాను (బోయజు) విడిపింపగలనని చెప్పెను. అవును అలాగే మనము కూడా ఈ లోకమునకు సాతానుకు సమీపముగా వున్నామని ఆ వాక్య భాగము మనము అధ్యయనము చేయుచున్నాము అయితే మనకు సమీపముగా వున్న ఈ అపవాదిని అనగా సాతానును ఈ లోకసంబంధిని విడిచి పెట్టకపోయినచో అనగా ఈ లోకంనుంచి వేరై యేసును ఆశ్రయించనిచో ఆ ప్రభువు యొక్క రక్షణను మనము పొందలేము. అయితే ఎంత మంది యేసును ఆశ్రయిస్తారో వారందరు ప్రభువు యొక్క రక్షణను ఆ రక్షణ ఆనందమును అందుకుంటారు అని గత పాఠంలో ధ్యానించగల్గితిమి అందుకు ఆ దేవ దేవునికి స్తోత్రములు.

రూతు విడుదలయును స్వేచ్ఛానందమును పొందుట (4వ అధ్యా).

క్రీస్తు నందు ప్రియులారా, మనమిప్పుడు రూతు విడుదల కార్యమును ఆలోచింతము. 4వ అధ్యాయ ప్రారంభమున రూతు విడుదల కార్యము ఏలాగు కొనసాగుచున్నదో చూడవచ్చును.

ఎ. పురద్వారమునొద్ద సమకూడుట (4:1).

బి. ఊరిపెద్దలను సమకూర్చుట (4:2).

సి. విడుదల కొరకైన మనుష్యులను వేచి వుండుట.

డి. పురనివాసులును సమకూడుట (4:4).

ఇ. స్వజనులు సమకూడబడుట (4:4).

ఎఫ్. విడిపింపగల సమీప బంధువును సమకూర్చబడుట (4:1).

జి. విడిపించు పని.

1) కొనుట – అమ్ముట (4:3)

2) పొందుట – సంపాదించుకొనుట (4:4)

**అమ్ముట - కొనుట :**

ఇచ్చట ఎవరైన ఒక వ్యక్తిని విడిపింపగోరిన యెడల ఆ వ్యక్తి ముందు వారికున్న స్వాస్థ్యమును (భూభాగమును) ముందు కొనాలి. రెండవది ఆ స్వాస్థ్యమును ఎప్పుడైతే ఈ బంధువు కొంటాడో అప్పుడు ఆ స్వాస్థ్యముతో ఆ స్వాస్థ్యంనకు సంబంధించిన మనుష్యులు కూడ తమకే వర్తిస్తారు.

ఇచ్చట చూడండి ఈ సమీపబంధువుడు స్వాస్థ్యము కావాలి అంటున్నాడు కాని, దాని తాలుక మనుష్యులు నాకు వద్దంటున్నాడు చూసారా (4:5,6) రూతును విడిపించుకోవాలి. అంటే "నేను దానిని (ఆ భూమిని) విడిపింపలేను" (4:6) అని అంటున్నాడు.

ఈ విధానమంతా ఎక్కడిదో తెలుసా? అపవాది విధానము. అన్నట్లు ఈ రోజుల్లో చాలా మంది మనుష్యులు అంటే చాలా మంది క్రైస్తవులు మనుష్యుడు సంపాదించే సంపాదన కావాలి అని అంటున్నారు. కాని ఆ మనిషి మాత్రం నాకొద్దు అని అంటున్నారు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని తీసుకుని తల్లిదండ్రిని చూడని కుమారులు ఎంతో మందుంటారు, మన క్రైస్తవ లోకములో, సాతాను తత్వమంత ఇదే. ఈ మనుష్యుల్ని దుర్నీతి నుంచి, పాపం నుంచి విడిపించి, సంపాదించే పని ఎవ్వరు చేయలేకున్నారు. ఒక్క యేసు ప్రభువు వారు తప్ప.

అందుకే రూతును విడిపించుటకు బోయాజు ముందుకు వచ్చుచున్నాడు. మహ్లోను భార్యయైన రూతును మోయాబీయురాలిని సంపాదించుకొని పెండ్లిచేసుకొనుచున్నాను". (4:10) అనుచున్నాడు. బోయాజు.

యేసుక్రీస్తు జనన వంశావలి చూడండి. మత్త 1:5,6 "శల్మాను రాహాబునందు బోయజును కనెను. బోయజు రూతునందు ఓబేదును కనెను. ఓబేదు యెష్షయిని కనెను. యెష్షయి రాజైన దావీదును కనెను". మత్త 1:17. "దావీదు మొదలుకొని క్రీస్తు వరకు పదునాల్గు తరములు.

చూడండి రూతు విడిపింపబడి రాజులను కనుటకు దేవుడు కృప చూపారు. అవును మనము కూడా రూతులా ఈ లోకము నుంచి లోకపు పాపము నుంచి విడిపింపబడవలసినవారమై యున్నాము. "యేసు క్రీస్తునందున్న వారికి ఏ శిక్ష విధియ లేదు ఎందుకనగా ఎవని వలనను రక్షణ కలుగదు ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన ఏ నామమున రక్షణ పొందలేము". అ.కా. 4:12.

"ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ" ఎఫెసి 1:7. ప్రియులారా, మనల్ని ప్రభువు విమోచించు నిమిత్తమై ఈ లోకంనకు వచ్చి, తన అమూల్య రక్తము ద్వార మన పాప చిత్తంనకు వృత్తి కలుగ జేసినారు. అవును యేసుక్రీస్తు ద్వారా తప్ప ఈ భూలోక మందు ఏ మానవునికి రక్షణ లేదు.

అందుకే బైబిలు వాక్యము చెబుతుంది. "ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను. దావీదు ప్రజలయందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు" (లూకా 2:10-11) యేసు రక్షకుడని తెలుసుకోవాలి. ఆయన తప్ప మరెవరు రక్షించువారు లేరని తెలిసికొని యేసును ఆశ్రయించాలి.

యేసు = అంటే రక్షకుడు అని అర్థం యేసు నన్ను రక్షించు అని నీవడిగితే యేసు తప్పక నిన్ను రక్షిస్తాడు అలా నీవు యేసు చెంతకు వచ్చిన వాడవైతే ఆయన ఇచ్చు రక్షణ ఆనందంను అందుకుంటావు. నీవు రూతు రాజవంశములోనికి వచ్చినట్లు యేసు అను రారాజు వంశంలోకి నీవు వస్తావు. అందుకే బైబిలు చెప్తుతుంది. రాజులైన యాజక సమూహములోనున్నాము అని.

కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (II కొరిం. 5:18) అని సెలవిచ్చుచున్నాడు.

ఈ నూతన సంవత్సరము నీవు యేసు చెంతకు వచ్చినచో

ఈ నూతన సంవత్సరము నీవు యేసును వేడుకొనినచో నీవును నూతన సృష్టిగా నూతనమును నిత్యమునైన ఆనందము నొందుదువు గాక. అవును. ఆమేన్.

ప్రభువునందు రెవ. కె. సమూయేలు,
M.A., B.D.
లెక్చరర్, గెత్సేమనే బైబిల్ కళాశాల, కరుణాపురం.



"కనికరం గలవారు ధన్యులు, వారు కనికరం పొందుదురు". - మత్తయి 5:7.

# ప్రిస్కిల్ల



మన ప్రభువైన యేసుక్రీస్తు నామములో ప్రతి స్థలములో ప్రార్థించువారి కందరికిని శుభమని చెప్పి వ్రాయునది, నూతన సంవత్సరంలో నూతన తలంపులతో, ఆశలతో అడుగిడిన మీ ఆశయాలను దేవుడు నెరవేర్చాలని, నూతన కార్యం జరిగించాలని ఆ నిత్య దేవుని ప్రార్థిస్తున్నాము. దేవుని సేవ చేయాలంటే సమస్తం, అనగా భార్య, పిల్లలు, ఉద్యోగం అన్ని విడి చి పెట్టాలి, బైబిల్ పట్టాలి అనే ఆలోచన లేదా అపోహ ఉండటం వల్ల, కొందరు వారికున్న బాధ్యతలు, భారాలను బట్టి సేవ చేయడం లేదు. కాని అలా కాదు, కుటుంబంను కలిగి, వృత్తులను చేపడుతూ కూడా, దేవుని సేవ చేయవచ్చు, అలా చేసిన వారిని పరిశుద్ధ గ్రంథంలో మనం చూడగలం "అటుతరువాత పౌలు ఏథెన్సు నుండి బయలుదేరికొరింథునకు వచ్చి, పొంతు వంశీయుడైన అకుల అను ఒక యూదుని, అతని భార్యయైన ప్రిస్కిల్లను కనుగొని వారి యొద్దకు వెళ్ళెను".అ.కా. 18:1.

అకుల ప్రిస్కిల్ల కొరింథునకు వలస వచ్చినవారు, దేవునియందు భయభక్తులు కలిగినవారు, దేవుని మాట ప్రకారం జీవించుటకు వ్యయ ప్రయాసాలకు ఓర్చినవారు, వీరు ప్రార్థనా పరులే కాదు, మంచి పనితనం గలవారు కూడా. వీరి వృత్తి డేరాలు కుట్టడం. వివిధ ప్రాంతాలను దర్శిస్తూ, సంఘాలను స్థాపిస్తూ, సువార్తను విస్తారముగా ప్రకటిస్తున్న పౌలు కూడా తన ఆర్థిక అవసరతల నిమిత్తం డేరాలు కుట్టేవాడు గనుక పౌలు వీరితో కలసి కొరింథులో ఉన్నాడు.

"నేనేవని పంపుదునో వాని చేర్చుకొనువాడు నన్ను చేర్చుకొనువాడగును". – యోహాను 12:20

అను దేవుని మాట ప్రకారం వీరు పౌలుకు తమ ఇంటిలో ఆశ్రయం కల్పించారు, కేవలం ఆశ్రయం కల్పించడమే కాదు గాని, పౌలుకు వీరు ఆసరాగా ఉన్నారు. అనగా పౌలు చేస్తున్న సువార్త పరిచర్యలో వీరు పాలిభాగస్థులయ్యారు. ధనార్జన కాదు గాని, ఆత్మలను సంపాదించాలనే ఆతృత, ఆసక్తి కలిగినారు.

అకుల ప్రిస్కిల్ల పౌలుతో కలిసి వివిధ ప్రాంతాలకు కూడా వెళ్ళి సువార్త ప్రకటించే వారు. వీరి ఇంట సంఘము కూడుకొనేది. పౌలు ప్రయాణాలలో ఉన్నా, వీరు సంఘములో ఆరాధన జరిగించేవారు. వీరివృత్తి డేరాలు కుట్టడం కాని వీరి ప్రవృత్తి అనేకుల ఆత్మీయ జీవితాలను కట్టడం. ఆ దినములలో సువార్త ప్రకటిస్తే చాలా శ్రమలు ఎదుర్కోవలసి వచ్చేది. చెఱసాలలో వేసేవారు, చిత్రహింసలు పెట్టేవారు, మరణకరమైన, వేదనకరమైన శిక్షలు విధించేవారు, అయినా వీరు ప్రాణాలకు తెగించి, ప్రభువు పరిచర్యలో ముందుకు సాగారు. వీరు ఒక్క సంఘము కొరకే కాక పౌలు కొరకు, అనేక అన్యజనుల కొరకు అనేక సంఘాల కొరకు అహర్నిషలు కృషి చేస్తూ అందుబాటులో ఉండేవారు. కనుకనే పౌలు (రోమా 16:34) వీరికి కృతజ్ఞతలు తెలుపుతున్నాడు. వీరేదో ఖాళీ సమయాలలో పౌలుతో, సంఘాలతో సమయం గడపలేదు కాని, ఎక్కువగా ప్రభుపనిలోనే ఉండేవారు, కేవలం తాత్కాలిక అవసరతల కొరకే డేరాలు కుట్టేవారు.

అకుల, ప్రస్కిల్ల భార్యభర్తలు, వృత్తి చేసుకునే వారు అయినా వారు పౌలుతో జతపని వారిగా పిలువబడినారు. జతపనివారు అనగా దాదాపుగా – పౌలు అంతగా ప్రయాసపడాలి. మరి ఈ రోజులలో దేవుని సేవలో సహాయపడాలంటే, నాకు ఉద్యోగం ఉంది, భార్యపిల్లలు ఉన్నారు, నాకు సమయము లేదు అని చాలా మంది అంటుంటారు. ఉన్న సమయమును సద్వినియోగము చేసుకొని జ్ఞానులవలె ప్రవర్తించాలి. ఈ దంపతులకు ఈ లోక ధనం, పరలోకధనాన్ని సమకూర్చలేదు అని తెలుసు కావున, ఈ జీవితాన్ని ఆత్మల రక్షణ కొరకు ఉపయోగిస్తే, తమ జీవితాలు ప్రభువుతో పరలోకంలో గడపవచ్చు అని గ్రహించారు. కనుకనే పౌలుతో ప్రయాసపడినారు. దేవుని సేవ చేయాలనే మన ఆశకు, కుటుంబమో, ఉద్యోగమో, పదవో, చదువో ఆటంకం కాదు. చిన్న కారణాలను బట్టి దేవుడిచ్చే విస్తారమైన దీవెనలను దూరం చేసుకోకూడదు. ముందుగా మనం హృదయపూర్వకముగా ఆయనకు మొఱ్ఱపెట్టాలి. ప్రిస్కిల్ల గృహిణి అయినప్పటికీ తన భర్తకు పనిలో, పరిచర్యలో చేదోడు, వాదోడుగా ఉంటూ మంచి సహకారిగా నిలిచింది, తను ఇంటిపనితో సరిపెట్టుకోకుండా, అన్ని వేళల్లో ప్రభుపనిలో కూడా బాధ్యత కలిగిన స్త్రీ. అకుల ప్రిస్కిల్లనే కాదు అనేకులు వారికున్న ఇతర పనులనుబట్టి ప్రభుపనిని ప్రక్కకు పెట్టకుండా, ధన్యతగా భావించి, బాధ్యతగా స్వీకరించి, చక్కగా నిర్వర్తించినట్లైతే పౌలుతో మంచిసాక్ష్యం పొందిన అకుల ప్రిస్కిల్ల వలె మనమూ మన ప్రభువైన యేసుక్రీస్తు నుండి సాక్ష్యంనే కాదు, దీవెనలనూ పొందుకుంటాము.

దేవుడు మిమ్ములను ప్రభుపనిలో వాడుకొనునుగాక. ఆమేన్.

**"హృదయ శుద్ధిగలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు". – మత్తయి 5:8.**

# జనవరి -2012 క్విజ్



1) దేవుడు ఏమి కోరుకొనుచున్నాడు ?
2) ఎప్పుడు వాగ్దానము నెరవేరును ?
3) ఇస్సాకు భయభక్తులు ఎవరి యొద్ద నుండి నేర్చుకొన్నాడు?
4) వాగ్దాన పుత్రుడు ఎవరు ?
5) ఇస్సాకు భార్య పేరు ?
6) ఎవరిని ఆశ్రయిస్తే రక్షణ అందుకుంటారు ?
7) రూతును విడిపించుటకు ఎవరు ముందుకు వచ్చారు ?
8) విమోచనము అనగా ఏమి ?
9) అకుల, ప్రిస్కిల్ల ఎక్కడికి వలస వచ్చారు ?
10) అకుల, ప్రస్కిల్ల వృత్తి ఏమటి ?

# డిసెంబర్ -2011 సమాధానములు

1) సమాధానము
2) యేసుప్రభు
3) అవిధేయత
4) పరిశుద్ధ జన్మ
5) దేవుని దూతలు
6) నయోమి ఆలోచన
7) యేసును
8) ఆజ్ఞలను
9) యెషయా
10) భయభక్తులు కలిగిన స్త్రీ

# "సొసైటీ ఆఫ్ క్రైస్ట్ పరిచర్య వివరాలు"

రి.నెం.267/2002/Wgl.

1) క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరము
2) గెత్సేమనే ప్రార్థన మందిరము (24 గం॥ల ప్రార్థన పరిచర్య)
3) గెత్సేమనే (వేదాంత) థియాలాజికల్ కాలేజ్
4) క్రీస్తు జ్యోతి సువార్త పరిచర్య
5) గెత్సేమనే గ్రామీణ సంఘ పరిచర్య
6) యేసు ప్రేమించుచున్నాడు మాస పత్రిక
7) ఆడియో, వీడియో క్యాసెట్ పరిచర్య
8) టి.వి. పరిచర్య క్రీస్తు కిరణాలు శుభవార్త టి.వి. ప్రతి ఆదివారం మధ్యా 3.30 నుండి 4.00 వరకు.
9) క్రీస్తు జ్యోతి ప్రార్థన పరిచర్య.

రెవ. డా॥ పాల్సన్‌రాజ్ .సంగాల
*Secretary*



"సమాధానపరచువారు ధన్యులు, వారు దేవుని కుమారులనబడుదురు". -మత్తయి 5:9.

## సాక్ష్యములు



**అయ్యగారు పేరుపెట్టి పిలిచినారు:** నాపేరు రేణుక తండ్రి లక్ష్మయ్య. నేను మా ఇంటి వద్దనుండి ఎంతో బాధ తో, హృదయభారంతో ప్రార్థనకు వచ్చాను. ప్రార్థనలో కూర్చొని ఎంతో వేదన గల హృదయంతో కన్నీళ్ళతో నా ఇరుకులను బట్టి, ఇబ్బందిని బట్టి బాధపడుతుండగా అయ్యగారి ప్రసంగంలో అయ్యగారి నోటి నుండి వచ్చే ప్రతి ఆదరణ గల మాటలు నా మండుచున్న హృదయంకు నెమ్మదిని, ఊరటను అనుగ్రహించినాయి ఎండిన ఎముకలకు జీవం పోసే నాదేవుడు, ఆయన తన కృపద్వారా నా ఆత్మీయ తండ్రుల ప్రార్థనల ద్వార నన్ను జ్ఞాపకం చేసుకొని నా పేరు పెట్టి నన్ను పిలిచినాడు. నా హృదయం యొక్క బాధను తొలగించినాడు. నాలో ఉన్న భయం తొలగిపోయింది. నన్ను దేవుని హస్తం తాకినట్టు అనిపించింది. నాహృదయ భారం తొలగి శాంతి సమాదానం పొందినాను. దేవునికి స్తోత్రం ఆత్మీయ తండ్రులకు వందనాలు తెల్పుతున్నాను.

**రేణుక, గ్రా॥దేవంపల్లి, మం॥ మానకొండూర్, జి॥ కరీంనగర్.**

---

**అయ్యగారి ప్రార్థనతో గుండె ఆపరేషన్ విజయవంతం :** నాపేరు సవిరం నర్సయ్య. నా వయస్సు 60సం॥ నేను గుండె నొప్పితో బాదపడ్డాను. అనేక సార్లు గుండెలో నొప్పి వచ్చింది. హాస్పిటల్‌కు వెళ్లాము, డాక్టర్‌గారు నన్ను పరిక్షించి గుండెలో మూడు ట్యూబ్స్ మూసుకుని పోయినవి. చాలా ఇబ్బంది కరమైన పరిస్థితిలో ఉన్నాడు, బ్రతికే అవకాశం తక్కువ అని చెప్పారు. అంతకు ముందు మామూలుగా మందులు వాడాను, కాని గుండె నొప్పి ఎందుకు వస్తుంది అని పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్తే పరీక్షించి అప్పుడు చెప్పారు నా గుండెలోని మూడు ట్యూబ్‌లు మూసుకుపోయినవి రక్త ప్రసరణ జరగడంలేదు అని. వెంటనే ఆపరేషన్ చేయాలి అని డాక్టర్‌గారు తెల్పిచెప్పారు. భయమేసింది. కన్నీళ్ళు విడుచుచూ డాక్టర్‌గారు చెప్పిన విషయం అంతా పాలయ్యగారికి తెలియజేయాలి అని తలంచి ఫోన్ చేశాను. అయ్యగారు నాకు ఫోన్‌లో ప్రార్థన చేశారు. నా వేదనను, బాధను తొలగించి దేవుని యందు విశ్వాసం ఉంచడానికి అయ్యగారు వాక్యం ద్వారా నన్ను బలపరచినారు "జీవమరణంలు యెహోవావశం", "ఆయన యొద్దకు వచ్చువారిని ఎంతమాత్రం త్రోసివేయని దేవుడు", "నీవు ఆయన యందు విశ్వాసం ఉంచు బ్రతుకుతావు", దేవుడు నిన్ను స్వస్థపరుస్తాడు" అని నన్ను ఓదార్చినారు, బలపరచినారు. చనిపోయిన లాజరును 3రోజుల తర్వాత జీవంతో లేపిన దేవుడు. ఆయనకు అసాధ్యం అయినది ఏమైనా ఉన్నదా అని చెప్పి నాహృదయంలో వేదనను తొలగించినారు. ధైర్యంగా నన్ను ఆపరేషన్‌కు వెళ్ళమని చెప్పారు. ఆపరేషన్ సక్సెస్ అవుతుంది భయపడకుమని ధైర్యపరచినారు. నేను అయ్యగారి మాటలతో ధైర్యం తెచ్చుకొని దేవునిపై భారం వేసి ఆపరేషన్‌కు వెళ్ళాను ఆపరేషన్ సక్సెస్ అయింది. నేను ఇప్పుడు సంపూర్ణ స్వస్థత పొందుకున్నాను. నాకు ఆపరేషన్ అయి 15 రోజులు అవుతుంది దేవుడు నా యందు దయ చూపి తన కృప చొప్పున నా జీవితంలో ఆయన చేసిన అద్భుత క్రియలను ప్రజలకు తెలియపరుస్తూ సాక్ష్యం చెప్పడానికి ఆపరేషన్‌అయి 15 రోజులు మాత్రమే అయినా వచ్చాను. అయ్యగారి మాట ప్రకారం మరియు అయ్యగారి ప్రార్థన ద్వార దేవుడు చూపిన కృపద్వార నేను సంపూర్ణ స్వస్థత పొందుకున్నాను. దేవునికి లెక్కించలేని స్తోత్రంలు తెల్పుతున్నాను. ఆత్మీయ తండ్రులకు పాదాభివందనాలు తెల్పుతున్నాను.



**సవిరం నర్సయ్య, గ్రా॥కాకుల కనుపర్తి, మం॥ సంగెం, జి॥ వరంగల్.**

"నీతి నిమిత్తం హింసింపబడువారు ధన్యులు, పరలోక రాజ్యం వారిది". - మత్తయి 5:10.



**కుటుంబ సమస్యలు తీరుస్తా అని అయ్య గారు ప్రవచించారు :** నా పేరు వి. రాజశేఖర్, నేను దాదాపు 10సం॥ నుండి కరుణాపురంకు ప్రార్థనకు హాజరవుతూనే వున్నాను. దేవుని ప్రేమను ఆత్మీయ తండ్రుల ప్రసంగం ద్వారా తెల్సుకొంటూ దేవునిలో బలపడుతునే ఉన్నాను. కాని నాకో చిన్న ఆశ ఉండేది అయ్యగార్లు ఇరువురు ప్రార్థిస్తూ అనేకుల సమస్యలు తీరుస్తా అని ఓదార్చుతూ వారి తప్పులను సరిచేస్తున్నారు. మరి నేను కూడా నా జీవితంలో ఎన్నో సమస్యలతో కృంగిపోతున్నాను. నా పేరు కూడా పిలవబడితే బాగుండు, దేవుడు అయ్య గారిలో ఉండి ఎప్పుడు నన్ను పిలుస్తాడో, పిలవాలి అని ఎంతో ఆశకలిగి నిరీక్షించినాను ఈ రోజు నేను ఏడుస్తూ ప్రార్థించుకొని దేవా పాపినైన నన్ను జ్ఞాపకం చేసుకోవా నా సమస్యలు తీర్చవా దేవా ఒకసారి ఆత్మీయ తండ్రులలో ఉండి నా పేరు పెట్టి పిలవవా అని ఏడుస్తూ ప్రార్థించినాను. వెంటనే అయ్య గారు నా 10 సం॥ నిరీక్షణకు తగిన మంచి బహుమానం నాకు అందించినాడు నా కుటుంబ సమస్యలు తీరుస్తా అని అభయం ఇస్తూ నా పేరు పెట్టి పిలచినాడు. దేవునికి స్తోత్రం ఆత్మీయ తండ్రులకు పాదాభివందనాలు తెల్పుతున్నాను.

**పి. రాజశేఖర్, గ్రా॥ వలిగొండ, నల్గొండ.**

**ఆక్సిడెంట్ నుండి రక్షించడం :** నా పేరు ఉండ్రాతి కర్ణాకర్ తండ్రి: సమ్మయ్య, మేము ఎర్రకోల్లం, భయంకరమైన విగ్రహారాధన చేసే వాళ్ళము. రక్షించేది రాళ్ళతో చేసిన విగ్రహాలు కాదని, మాట్లాడే దేవుడు యేసయ్య అని తెలుసుకొని 3సం॥రాలు. నేను మా గ్రామం నుండి హన్మకొండకు ఆటోలో వస్తున్నాను. ఎదురుగా జీప్ వస్తుంది. ప్రమాదవశాత్తు అది మా ఆటోను ఢీ కొట్టింది. ఒక్కసారిగా అందరు అరిచారు. మనిషికో దిక్కువడి పోయారు. అందరికి తీవ్రగాయాలు అయ్యాయి. మరణాపాయ స్థితిలో కొందరున్నారు. నేను ఆటోను జీప్ ఢీ కొడుతుండగానే భయంతో యేసయ్య, పాలయ్య అని అరిచాను. నేను కూడా అందులో నుండే ఒక పక్కకు పడిపోయాను. అందరికి తీవ్ర గాయాలయ్యాయి. నాకు మాత్రం చిన్న దెబ్బ కూడా తగలలేదు. అక్కడున్న వారెంతో ఆశ్చర్యపోయారు. "ఎంత గొప్ప దేవుడు యేసు ప్రభు" అని అందరూ దేవునికి వందనాలు చెప్పారు. గొప్ప ప్రమాదం నుండి, చావు నుండి నన్ను విడిపించిన యేసయ్యకు వందనాలు. అపుడు నాకు వెంటనే పాలయ్య, ప్రకాశయ్యలు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. అవి "నీ కుడిపక్క పదివేల మంది. నీ పక్కను వేయి మంది పడినను అపాయము నీ యొద్దకు రాదు. నీ మార్గములన్నింటిలో నిన్ను కాపాడుటకు, నీ పాదములకు రాయి తగులకుండా ఉండుటకు దేవుడు తన దూతలను పంపుతాడని అయ్యలు చెప్పారు. ఆ మాటలు నా జీవితంలో నెరవేరాయి. ఎంత మంచి దేవుడు. నా యేసయ్యకు స్తోత్రాలు. అందరి ప్రయాణంలో క్షేమం కలగాలని ప్రార్థించే పాలయ్య, ప్రకాశయ్యలకు నా హృదయ పూర్వక వందనాలు.



**ఉండ్రాతి కర్ణాకర్**
**గ్రా॥ నారక్కపేట, మం॥నల్లబెల్లి, వరంగల్.**



**ప్రార్థన వలన దగ్గు, దమ్ము తగ్గుట :** నా పేరు పోశాల సారంగపాణి, వయస్సు: 45 సం॥రాలు, దేవుని నమ్ముకొని 3 సం॥రాలు. నేను గత 3 సం॥రాలు నుండి దగ్గు, దమ్ముతో చాలా బాధపడ్డాను. ఎన్ని హాస్పిటల్స్ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. డాక్టర్స్ టెస్ట్ చేసి నీ అనారోగ్యత నుండి స్వస్థత పొందుకోవడం చాలా కష్టం అని చెప్పారు. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోయింది. చెట్ల మందులు కూడ వాడినా ప్రయోజనం లేకపోయింది. 30 వేల రూ॥లు ఖర్చు అయినవి. నేను కరుణాపురంలో పాలయ్య గారి ప్రార్థన సహవాసంలో పాల్గొనేవాడను. 01-01-2010 రోజున ప్రార్థనలో పాల్గొన్నాను. (కీర్తనలు 103:1) నా ప్రాణమా యెహోవాను సన్నుతించుము, ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము అని వాక్యం చెప్పారు. ఆ వాక్యం ద్వారా నేను దేవుని ఎంతో ఆరాధించాను, అలాగే చాలా ఆదరణ పొందుకున్నాను. ఆ వాక్యం విని వెంటనే దేవుని బలమైన శక్తి ప్రవేశించి నా దగ్గు, దమ్ము నుండి విడుదల పొందుకున్నాను. దేవుడు చేసిన ఉపకారమును స్తుతించాను. దేవుడు చేసిన గొప్ప కార్యము నకై కోట్లాది స్తోత్రాలు. అలాగే మా కోసం ప్రార్థిస్తున్న ప్రవక్తలు, దైవ సేవకులు, పాలయ్య మరియు ప్రకాశయ్య గార్కి నా హృదయ పూర్వక వందనాలు.

**పోశాల సారంగపాణి,**
**గ్రా॥ పున్నేలు, వర్ధన్నపేట, వరంగల్.**



**ప్రార్థన వలన చేతబడి శక్తుల నుండి విడుదల :** నా పేరు స్వరూప, భర్త: రామచంద్రయ్య, నేను అనేక చేతబడి శక్తుల నుండి అయ్యగారి ప్రార్థన ద్వారా విడిపించబడ్డాను. మాకు తెల్సినవారు మామీదికి అనేక దుష్టశక్తులను పంపచూచుతూ, అనేక మంత్ర శక్తులను పంపుతున్నారు. 4 నెలల నుండి మాకీ భాద ఎక్కువ అయింది. కాని దేవుడు ఆత్మీయ తండ్రుల ప్రార్థన ద్వారా వాటి భారి నుండి మమ్మును అనేక రీతులుగా కాపాడుతున్నాడు. ఇంకా దేవుడు నన్ను ప్రేమించి నాకు జీవనాధారం లేదు ప్రభువా సహాయం చేయమన్నప్పుడు కూరగాయలు అమ్మడానికి నాకు దేవుడు తన కృపచూపినాడు ఇంకా ఆత్మీయ తండ్రుల ప్రార్థన ద్వారా నేను నా కుటుంబం జీవింపబడుతున్నాము. అనేక మేలులు పొందుతున్నాము. నా శత్రువుల యెదుట నీవు నాకు భోజనం సిద్ధపరచుదువు, నా గిన్నె నిండి పొర్లుచున్నది నేను బ్రతుకు దినములన్నియు కృపాక్షేమములే వెంట వచ్చును" అని కీర్తనాకారుడు పలికిన పాట ప్రకారం దేవుడు ఆత్మీయ తండ్రుల ప్రార్థన ద్వారా అన్ని విధాల మమ్మును ఆదుకొనుచున్నాడు. దేవునికి స్తోత్రం ఆత్మీయ తండ్రులకు వందనాలు తెల్పుతున్నాను.

స్వరూప, నర్సంపేట, వరంగల్.

---

**ప్రార్థన ద్వారా మర్డర్ కేసు నుండి విడుదల పొందుట :** నా పేరు అంబాల రాజు నా తండ్రి: పురుషోత్తం, నేను ఇష్టపడ్డ అమ్మాయితో దేవుని కృప ద్వారా వివాహం జరిగింది. నేను కరుణాపురం వచ్చి యేసయ్య గురించి పూర్తిగా తెలుసుకున్నాను. ప్రకాశయ్య చెప్పే వాక్యాన్ని వింటూ విశ్వాసంలో బలపడినాను. దేవుని ద్వారా ఎన్నో మేలులు పొందుకున్నాను అందులో ఒక చిన్న సాక్ష్యం. నేను ఒక అమ్మాయిని ప్రేమించాను. ఆమె మాకు వివాహం జరిపించరు కావచ్చు అని ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్ళి పోయింది. అయితే ఆ అమ్మాయి ఇంటివారు నాపై ఆ అమ్మాయిని చంపేసానని కేసు పెట్టారు. కానీ నాకు మాత్రం ఆ అమ్మాయి ఎటు వెళ్ళిందో తెలియదు. నేను నిజం చెప్పినా వారు నమ్మడం లేదు. నేను ఎలా ఈ నేరం చేయలేదని ఎవరికి తెలియజేయాలో అర్థం కాలేదు. ఈ అయోమయ పరిస్థితులలో నాకు కరుణాపురంలో జరిగే అద్భుత కార్యాలు గుర్తుకొచ్చాయి. "మార్గం, సత్యం, జీవం" ఐన యేసయ్య సత్యాన్ని అందరికీ బయలు పరుస్తాడు కదా అనే విశ్వాసంతో ఇంటికి వచ్చాను. నేను నా పరిస్థితి గురించి ఏం చేయాలో యేసయ్య నాతో మాట్లాడు అని నేను బాధపడుచుండగా ప్రకాశయ్య వాక్యం చెప్తూ "కాబట్టి మీరు వారికి భయపడకుడి మరుగైనదేదియు బయలుపరచబడక పోదు, రహస్యమైనదేదియు తెలియబడక పోదు". అన్నారు. ఈ వాక్యంను బట్టి నా జీవితంలో కార్యం జరిగించమని ప్రార్థించాను. వాక్యం చివర పాలయ్య ప్రార్థన చేసారు. నాకు ధైర్యం వచ్చింది. తరువాత ఆ అమ్మాయి ఇంటికి వచ్చింది. అయ్య ప్రార్థన ద్వారా నాపై పెట్టిన మర్డర్ కేసు కొట్టేసారు. అంతేకాకుండా నేను ప్రేమించిన ఆ అమ్మాయికి నాకు వివాహం జరిపించారు. నా జీవితంలో గొప్ప కార్యం జరిగించిన యేసయ్యకు స్తోత్రాలు. నా గురించి ప్రార్థించిన పాలయ్య గారికి, ప్రకాశయ్య గారికి నా యొక్క కృతజ్ఞతాస్తోత్రాలు చెల్లిస్తున్నారు.



అంబాల రాజు ఖిలా వరంగల్, వరంగల్.

**ప్రార్థన వలన ముక్కులో దుర్మాంసం తొలగిపోవుట :** నా పేరు దాసరి నక్షత్ర, నా భర్త పేరు ఐలయ్య, మాది జూపాక మేము దేవున్ని నమ్ముకొని 5 సంవత్సరాలు అవుతోంది. మేము దేవున్ని నమ్ముకున్నప్పట్నుంచి ఎన్నో ఆశీర్వాదాలు దేవుడు మాకు అనుగ్రహించాడు. అయితే గత ఒక సంవత్సరం నుండి నా ముక్కులో దుర్మాంసం పెరిగి, శ్వాస తీసుకోరాలేదు. దాని వల్ల నా ప్రాణం పోయినట్లు అయ్యేది. అలాగే దుర్మాంసం కారణంగా భరించలేని దుర్వాసన నా ముక్కులో నుండి వచ్చేది. చీము, రక్తమూ వచ్చేది. దీని కోసం ఎన్ని మందులు వాడినా, వాంతులు అయ్యేవే కానీ, ఫలితం దక్కలేక పోయింది. దాదాపు 50,000/- రూ॥లు ఖర్చయ్యాయి. అలాంటిది జనవరి నెల 9వ తేది 2010లో నేను కరుణాపురంలోని క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరానికి వచ్చినప్పుడు ప్రకాశయ్య ద్వారా దేవుడు ఓదార్పు అనుగ్రహించాడు. ఆ రోజు అయ్య దేవుని పరిశుద్ధ గ్రంథములోని" సోలోమోను మహారాజు వెండి, బంగారం ఆయన్ను అడగలేదు గానీ దేవుని జ్ఞానాన్ని అడిగి తన్ను తాను దేవునికి విధేయుడైనాడు, ఆయనను దీనంగా వేడుకున్నాడు" ఈ మాటలు విన్న నాలో విధేయత వచ్చింది. నేను కూడా దేవునికి నన్ను నేను సమర్పించుకొని కన్నీటితో ప్రార్థించినప్పుడు, దేవుడు నా పేరుపెట్టి పిలిచి, నా రోగాన్ని బాగుచేస్తున్నట్లు అయ్యలో వుండి మాట్లాడాడు. ఆ క్షణమందే నా ముక్కులో పెరిగిన మాంసం తగ్గిపోయింది, శ్వాస సులభంగా వస్తుంది, అలాగే చీము, రక్తము రావడం తగ్గింది. నా దుర్వాసన పోయింది. నన్ను అద్భుత రీతిగా బాగుచేసిన దేవునికి స్తోత్రాలు, నా కోసం ప్రార్థించినట్టి నా పాలయ్య, నా ప్రకాశయ్యలకు నా మనస్సు పూర్వక వందనాలు.



**దాసరి నక్షత్ర,** జూపాక, హుజురాబాద్, కరీంనగర్.

**ప్రార్థన ద్వారా మరణం నుండి విడిపించి కుమారున్ని ఇచ్చుట :** నా పేరు అనిత, భర్త: రజినికాంత్, నాకు వివాహమై ఒక సంవత్సరం అవుతుంది. దేవుడు నన్ను ప్రేమించి, నాకు గర్భం తెరచి నాకు కుమారున్ని ఇచ్చినా డు నా డెలివరి సమయంలో నాకు పెద్ద ఆపరేషన్ అయింది. నాకు కుమారుడు జన్మించి నాడు. శిశువుని బయటికి తీసిన తర్వాత నాకు ఫిట్స్ వచ్చింది. ఈమె చనిపోతది అన్నారు. అదే సమయంలో నాకు సాతాను శక్తులు పట్టినవి. మా బంధువులు ఎంతో ఆందోళన చెందుతూ పాలయ్య గారికి ఫోన్ చేసినారు. అయ్యగారికి ఫోన్‌లో నా పరిస్థితి మా కుటుంబీకులు ఎంతో ఏడ్చి చెప్పారు. అయ్యగారు నా యందు దయచూపించి నా పక్షంన దేవునికి భారంగా విజ్ఞాపనలు చేసినాడు అయ్యగారు ప్రార్థిస్తుండగానే నాలోని సాతాను నన్ను విడిచి వెళ్ళిపోయింది. నా ఫిట్స్ వ్యాధి తగ్గింది దేవుడు తన గాయపడిన హస్తం ద్వారా నన్ను ముట్టి తలమొదలుకొని అరికాలు వరకు నన్ను స్వస్థపరచినాడు. నేను నా కుమారుడు క్షేమంగా ఉన్నాము. దేవుడు మమ్మును నశింపనివ్వకుండ మృత్యువు యొక్క అలల నుండి విడిపించినాడు మమ్మును రోగం నుండి విడిపించి స్వస్థపరచినాడు. దేవునికి స్తోత్రం ఆత్మీయ తండ్రులకు వందనాలు తెల్పుతున్నారు.



**అనిత,** పెద్దపురం, ఆత్మకూర్, వరంగల్.

**ప్రార్థన వల్ల రక్తస్రావం నుండి విడుదల పొందుట :** నా పేరు దేవమ్మ, భర్త: సదానందం, నాకు రెండు సంవత్సరాల నుండి తెల్ల రక్త స్రావం అవుతుంది. రక్తస్రావంతో విపరీతమైన. కడుపునొప్పి నడుమునొప్పి, భరించలేకుండ శరీరమంతా నొప్పులు ఉంటున్నాయి. డాక్టరు దగ్గరికి వెళ్తే గర్భసంచి ఆపరేషన్ చేసి తీసివేయాలి. అన్నారు. నేను ఆపరేషన్ చేయించుకోను అన్నాను. పన్నెండు సంవత్సరాల నుండి రక్త స్రావం చేత బాధపడుతున్న స్త్రీ ఆయన వస్త్రం తాకితేనే ఆమెకు స్వస్థత కలిగింది. స్వస్థపరిచే దేవున్ని విడిచి పెట్టి డాక్టర్లను ఆశ్రయించాలా అని చెప్పి ఆపరేషన్ చేయించుకోలేదు, దేవుడే నన్ను బాగుచేస్తాడు అన్న విశ్వాసంతో ప్రతివారం కరుణాపురం వస్తున్నాను, వారం వారం అందరు సాక్ష్యాలు చెబుతుంటే దేవా నేను నీ సన్నిధిలో నీ సాక్షిగా నేను ఉండాలి నన్ను బాగుచేయండి అని ప్రార్థన చేసుకుంటున్నాను అయితే రెండు వారాల క్రితం కరుణాపురం వచ్చి ప్రార్థన చేసుకుంటున్నప్పుడు. నాకు వెలుగు తాకినట్టయింది. అయినా నేను దానిని సరిగ్గా గ్రహించలేక పోయాను. నాకు తెలియకుండానే దేవుడు ఆశ్చర్య రీతిగా నన్ను బాగుచేసాడు. డాక్టరు దగ్గరికి వెళ్తే ఆపరేషన్ అవసరము లేదు. గర్భసంచి తీసివేయాల్సిన అవసరం లేదని చెప్పారు. నేను నా కుటుంబ సభ్యుల మాటలు నమ్మి ఉంటే దేవుని కార్యాన్ని చూసేదాన్ని కాదు. కాని నేను దేవున్ని ఆయన ప్రవక్తలను నమ్ముకొని ప్రార్థనకు వచ్చినప్పుడు దేవుడు నన్ను ఆశ్చర్యరీతిగా బాగుచేసాడు. దేవునికి కోట్లాది స్తోత్రాలు. దివారాత్రులు మాకోసం ప్రార్థిస్తున్న పాలయ్య, ప్రకాశయ్యలకు వందనాలు. **దేవమ్మ,** పలువేల్పుల, హసన్‌పర్తి, వరంగల్.





"మీ మాట అవునంటె అవును, కాదంటె కాదు అని యుండవలెను". - మత్తయి 5:37.








# ప్రార్థన

“జీవాధిపతియైన దేవా నీకే మా స్తోత్ర, జిహ్వాఫలాలు చెల్లిస్తున్నాము. దయగల ప్రభువా,
గడిచిన కాలమంతయు నీ రెక్కల క్రింద కాపాడి ఎన్నో దీవెనలు అనుగ్రహించావు.
ఈ సంవత్సరములో నీ మాట విని, వాక్యంను చదువుచూ, కీర్తనలు పాడుచూ, నిత్యము
నీ మందిరంలో గడుపుచూ నీ దైవదాసుల నోట నుండి పలుకబడిన ప్రతి మాటకు లోబడి,
విధేయులమై నీ దీవెనలు పొందుకొనుచూ నీ పరిచర్యలో ముందుకు కొనసాగుచూ,
అనేకులను దీవెనలతో నింపబడునట్లును మమ్మును వారికి మార్గదర్శకులుగా నిలబెట్టండి,
దేవా నీ మాట విన్నవారిని ఎంతగానో దీవించారు ఆ దీవెన తరతరములు ఉన్నది.
ఈ సంవత్సరములో నీవు మాకు ఆజ్ఞాపించిన మాటలన్నిటిని గైకొని వాటి
ప్రకారంగా మా జీవితంను సరిదిద్దుకొని, మా చెడు నడతలను మార్చుకొని
నీకు ప్రియమైన బిడ్డలుగాను, నీ దైవజనులకు సహకారులుగాను, ఇష్టులుగాను
నీ ప్రజలందరికి దీవెనకలిగించేదిగా మమ్ములను నీవే నడిపించండి. ఈ సంవత్సరంలో
మా దేశ ప్రజలందరును, అధికారంలో ఉన్నవారు, ఉద్యోగం చేస్తున్నవారు, వ్యవసాయకులును,
యౌవ్వనులు, వృద్ధులు, చిన్న పిల్లలు నీ దీవెనలు పొందుకొనుచూ, నిన్ను స్తుతించుచూ
నీ నామమునకు మహిమకరముగా జీవించునట్లుగా నీ కృప తోడుగా ఉంచి,
బలపరచుమని సమస్త దీవెనలకు కర్త అయిన యేసుక్రీస్తు
నామములో ప్రార్థన చేయుచున్నాము తండ్రి.



**ఆమేన్.**






*Printed Matter*

**Book Post**

*From :*

**Gethesemane Prayer Hall**
Yesu Nilayam, Karunapuram,
Peddapendyala, Warangal - 506 151,
Ph :08711 - 223115, 92470 09336
email : paulsonraj@yahoo.com